# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
శుక్రవారం | 12 | జూన్ | 2026 పేజీలు: 6




వీకెండ్ వచ్చిందంటే చాలు.. జనాలు ఈత వనాల వైపు క్యూ కడుతున్నారు. ప్రకృతి పానీయం కోసం జనాలు పోటీ పడుతున్నారు. కల్తీ లేని స్వచ్ఛమైన కల్లు కోసం జనాలు ఎగబడుతున్నారు. స్వచ్ఛమైన కలలో ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల ఈత కల్లు కోసం జనాల్లో ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో వీకెండ్ వచ్చిందంటే చాలు కల్లు ప్రియులతో ఈత వనాలు కిటకిట లాడుతున్నాయి. దీంతో ఈత వనాలన్నీ పిక్నిక్ స్పాట్ గా మారుతున్నాయి. కల్లు ప్రియుల కోసం ఈత వనాల యజమానులు ఈత వనాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జనాలు కూర్చోవడానికి కుర్చీలు టేబుళ్లు ఏర్పాటు చేసి కల్లు ప్రియులు సేద తీర్చుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. కల్లు ప్రకృతి పానీయం కావడం.. ఆరోగ్యానికి మంచిది కావడంతో ప్రతిరోజు తో పాటు వీకెండ్‌లో జనాలతో మరింత ఈత వనాలకు తాకిడి ఎక్కువవుతుంది

# వీకెండ్ వచ్చిందా...
# ఈత వనానికి క్యూ..

3





# లా రీవాల్యుయేషన్‌పై ఓయూ స్పష్టత

నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు: రిజిస్ట్రార్
మూల్యాంకనంలో తప్పిదాలకు తావులేదు: ఉస్మానియా యూనివర్సిటీ

4

# వర్షాకాలానికి ఎంఎంసి ముందస్తు చర్యలు



డ్రైనేజీల డీసిల్టింగ్,
దోమల నివారణపై ప్రత్యేక దృష్టి..

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన
కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి..

2

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. గురువారం హయత్నగర్ బంజారా కాలనీ, రాఘవేంద్ర హోటల్ పరిసరాలు, హైకోర్టు కాలనీ, కప్పల చెరువు, యశోద ఎన్క్లేవ్, హరిహరపురం కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు.



# వర్షాకాలానికి ఎంఎంసి ముందస్తు చర్యలు






**డ్రైనేజీల డీసిల్టింగ్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి..**
**లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి..**

సికింద్రాబాద్, జూన్ 11 (మనం న్యూస్) వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. గురువారం హయత్నగర్ బంజారా కాలనీ, రాఘవేంద్ర హోటల్ పరిసరాలు, హైకోర్టు కాలనీ, కప్పల చెరువు, యశోద ఎన్క్లేవ్, హరిహరపురం కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వర్షపు నీరు నిలిచే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్, నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిల్వ నీటిని వెంటనే తొలగించి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాఘవేంద్ర హోటల్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించే డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. హైడ్రా అధికారులు, డీఆర్ఎఫ్ సిబ్బందితో సమావేశమైన కమిషనర్ వర్షాకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టిన సన్నద్ధతను సమీక్షించారు. ముందస్తు ప్రణాళికతో పనిచేసి నీటి నిల్వలను నివారించాలని సూచించారు. హైకోర్టు కాలనీలో అంతర్గత రహదారులు, నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించి యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. కప్పల చెరువు, హరిహరపురం కాలనీల్లో దోమల లార్వా వ్యాప్తి పరిస్థితులను పరిశీలించిన కమిషనర్, యాంటీ లార్వా ట్రీట్మెంట్ కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని ఎంటమాలజీ బృందానికి సూచించారు. యశోద ఎన్క్లేవ్ కాలనీలోని పార్కు నిర్వహణ, పరిశుభ్రత పనులను సమీక్షించి పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరచాలని యూసీడీ అధికారులను ఆదేశించారు..గాంధీనగర్లో డ్రైనేజీ అనుసంధానం, నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి అడ్డంకులను సకాలంలో తొలగిస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణతో పాటు వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశించారు.

# ఆర్వీఎం, ఎయిమ్స్ హాస్పిటల్స్‌కు బస్సు నడపాలి

**మేడ్చల్ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేసిన బిజెపి నేతలు**




మేడ్చల్, జూన్ 11 ( మనం జిల్లా ప్రతినిధి): పేద ప్రజలకు వైద్య సదుపాయాలు అందించే ఆర్వీఎం,, ఎయిమ్స్ హాస్పిటల్ లకు బస్సులు నడపాలని కోరుతూ మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ కు బీజేపీ నేతలు వినతి పత్రం అందజేశారు. సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మేడ్చల్ మరియు పరిసర ప్రాంతాల వైద్య సేవల కోసం వంటిమామిడిలోని ఆర్వీఎం హాస్పిటల్ బీబీనగర్ వద్ద గల ఎయిమ్స్ హాస్పిటల్లకు అధిక సంఖ్యలో పేద మధ్య తరగతి కుటుంబాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని బీజేపీ మేడ్చల్ నేతలు మేడ్చల్ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమములో బీజేపీ నేతలు సి ఎచ్ శ్రీనివాస్ గౌడ్,జాకట ప్రేమ్ దాస్, మహేష్ మేడ్చల్ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శి వంశీధర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు,జిల్లా బీజేవైఎం కార్యదర్శి రాఘవ రెడ్డి, గొప్ప నాగరాజు,జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చేవెళ్ల సొసైటీలో ఎరువులు సిద్ధం

**– చైర్మన్ దేవర వెంకటరెడ్డి**

చేవెళ్ల, జూన్ 11(మనం న్యూస్): చేవెళ్ల సొసైటీ గోదాంలో రైతులకు సరిపడా యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి తెలిపారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, యూరియా కావలసిన వారు యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, దేవల్లారి గోపాల్ రెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, జంగన్నోళ్ల అశోక్, సొసైటీ సిబ్బంది వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కండ్లకోయలో వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



మేడ్చల్, జూన్ 11 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్లకోయలో బొడ్రాయి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కండ్లకోయ పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మూడో వార్షికోత్సవ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పెద్దల ఆధ్వర్యంలో కాలనీవాసులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల మధ్య బొడ్రాయికి పంచామృతాభిషేకాలు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం దేవతను పూలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పట్టణ పెద్దలకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ బొడ్రాయి అమ్మ వారి కృపతో గుండ్ల పోచంపల్లి డివిజన్ ప్రజలందరూ పాడిపంటలతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. పట్టణానికి ఎలాంటి దిష్టి, కీడు కలవకుండా ప్రజలంతా ఐక్యమత్యంతో ప్రశాంతంగా జీవించాలని అమ్మవారు వేడుకున్నట్లు పేర్కొన్నారు. కండ్ల కోయలో జరిగిన ఈ ఉత్సవాలకు మహిళలు యువకులు వృద్ధులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇలాంటి ఇబ్బందులతో అన్ని ఏర్పాట్లు చేశారు ఈ కార్యక్రమంలో కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాటి నరేందర్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సముద్రాల హంస రాణి కృష్ణ గౌడ్, రాజేందర్ తలారి వెంకటేష్ ఎంజి రాజు పెంటయ్య శ్రీకాంత్, ప్రభాకర్ మహేందర్ భిక్షపతి స్థానిక నాయకులు ప్రతినిధులు పట్టణ ప్రముఖులు పట్టణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# వీకెండ్ వచ్చిందా... ఈత వనానికి క్యూ..

***వీకెండ్ వచ్చిందంటే చాలు.. జనాలు ఈత వనాల వైపు క్యూ కడుతున్నారు. ప్రకృతి పానీయం కోసం జనాలు పోటీ పడుతున్నారు. కల్తీ లేని స్వచ్ఛమైన కల్లు కోసం జనాలు ఎగబడుతున్నారు. స్వచ్ఛమైన కలలో ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల ఈత కల్లు కోసం జనాల్లో ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో వీకెండ్ వచ్చిందంటే చాలు కల్లు ప్రియులతో ఈత వనాలు కిటకిట లాడుతున్నాయి. దీంతో ఈత వనాలన్నీ పిక్నిక్ స్పాట్ గా మారుతున్నాయి. కల్లు ప్రియుల కోసం ఈత వనాల యజమానులు ఈత వనాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జనాలు కూర్చోవడానికి కుర్చీలు టేబుళ్లు ఏర్పాటు చేసి కల్లు ప్రియులు సేద తీర్చుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. కల్లు ప్రకృతి పానీయం కావడం.. ఆరోగ్యానికి మంచిది కావడంతో ప్రతిరోజు తో పాటు వీకెండ్ లో జనాలతో మరింత ఈత వనాలకు తాకిడి ఎక్కువవవుతుంది***



మేడ్చల్, జూన్ 11 (మనం జిల్లా ప్రతినిధి): ప్రకృతి సహజంగా దొరికే ఈత కల్లులో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. సహజంగా ఈతకల్లు రెండు రూపాలలో లభ్యమవుతుంది. ఒకటి నీరా కాగా మరొకటి ఈత కల్లు... నీరాను తెల్లవారుజామున సేవించాల్సి ఉంటుంది. నీరా ఈత కల్లు లో ఔషధ గుణాలు పుష్కలంగా ఉండడంతో వీటి కోసం జనాలు ఎగబడుతున్నారు. నీరా ఈత కల్లులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. నీరా శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపిస్తుంది. తెల్లవారుజామున నే నీరా ను శరీరానికి ఎంతో మంచిదని స్వయంగా డాక్టర్లే తెలుపుతున్నారు. ఇక ఈత కల్లు విషయానికి వస్తే ఇందులో కూడా ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఈత కల్లులో షుగర్, ప్రోటీన్ కార్బో హైడ్రేడు విటమిన్ సి, అమ్మినో ఆక్సీడ్, పొటాషియం ఐరన్ జింక్, విటమిన్ బి 1 బి 2బి 3 వంటి పోషకాలు లభిస్తాయి.

## జీర్ణ వ్యవస్థకు ఉపయోగం

మనలో చాలామంది తాటికల్లు ను సేవిస్తూ ఉంటారు. ప్రతిరోజు తాగే వారు కూడా ఉన్నారు. మాంసాహారం జంక్ ఫుడ్ మసాలా వంటి ఆహారపు అలవాట్లతో అస్తవ్యస్తమైన మనిషి జీర్ణాశయ వ్యవస్థకు కల్లు ఎంతో గాను దోహదపడు తుంది. పడగడుపునే తీసుకుంటే చక్కటి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని డాక్టర్లు పేర్కొనడంతో జనాలు ఈత వనాల వైపు క్యూ కడుతున్నారు.



## నగరం శివారులలో జోరుగా ఈతవనాలు.



రాష్ట్ర రాజధాని అయిన భాగ్యనగరం చుట్టూ వైపుల ఈతవనాలను ఏర్పాటు చేశారు. గతంలో గ్రామీణ ప్రాంతాలలో ఎటు చూసినా ఈత తాటి వనాలే దర్శనం ఇచ్చేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈత తాటి వనాలు అంతరించిపోయాయి. దీంతో ఈత తాటి కల్లు దొరకడమే మహాభాగ్యంగా మారింది. కళ్ళు ప్రియులను దృష్టిలో పెట్టుకొని ఈతవనాలను పెంచుతూ స్వచ్ఛమైన కల్లును అందిస్తున్నారు. ఎకరాలలో ఈతవనాన్ని పెంచి ప్రజలకు ఈత కల్లు రుచి చూపిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరానికి సమీపంలో సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల, మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాపురంలో 12 వందల ఈత వనం ఉంది అదేవిధంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో రెండు ఎకరాలలో ఈత వనం ఉంది. వీకెండ్ వచ్చిందంటే చాలు ఈ రెండు ఈతవనాలు కల్లు ప్రియులతో కిటకిట లాడుతాయి. ఈత వనాలను పెంచి ఈత కల్లు వ్యాపారం చేస్తున్నారు. ఈత చెట్లకు ఉండే మట్టలను నాలుగైదు సార్లు చెక్కడం ద్వారా వాటి నుండి వచ్చే కల్లును కుండల ను పెట్టి సేకరిస్తారు. ముందుగా లోపలి మట్టను చెక్కుతారు. వారం రోజులపాటు దాని అలాగే వదిలేస్తారు.. వారం రోజుల ముగిసిన తర్వాత మరోసారి చెక్కుతారు. అనంతరం వచ్చే కల్లును కుండల ద్వారా సేకరిస్తారు.





## డాక్టర్ల సిఫార్స్

పకృతి సహజమైన ఈత కల్లును సేవిస్తే కిడ్నీలోని రాళ్లు ఇట్టే కరిగిపోతాయని స్వచ్ఛమైన కళ్ళు తాగాలి అంటూ డాక్టర్లు సూచిస్తున్నారు. అంటే ఈత కళ్ళు వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా శరీరంలోని ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి ఈత కళ్ళు ఎంతో ఉపయోగపడుతుందని, స్వచ్ఛమైన కళ్ళు సేవిస్తే గుండె జబ్బులు క్యాన్సర్ వంటి రోగాలను దగ్గరికి రానివ్వవని డాక్టర్లు పేర్కొనడంతో ఈత తాటికల్లు కు విపరీతంగా డిమాండ్ పెరిగింది.

## స్వచ్ఛమైన కల్లు కోసం...

స్వచ్ఛమైన కల్లు కోసం నగరవాసులు ఎంత దూరమైన వెళ్లడానికి సిద్ధపడుతున్నారు. మెదక్ జిల్లా వెంకటాపురం, సంగారెడ్డి జిల్లా గుమ్మడి తలలో ఉన్న ఈత వనానికి వెళ్లాలంటే 25 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అయితే ప్రకృతి నుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లు కోసం వీకెండ్ లో జనాలు ఉదయమే ఈత వనంలో వాలిపోతున్నారంటే కల్లుకు డిమాండ్ ఎంత ఉందో ఇట్టే అర్థమవుతుంది.

# నక్ష స్థలాన్ని కూడా వదలరా?

## మేడ్చల్ తహసిల్దార్ కు ఫిర్యాదు సమగ్ర విచారణ జరిపి నక్ష స్థలాన్ని కాపాడాలని స్థానికుల డిమాండ్

మేడ్చల్, జూన్ 11 ( మనం జిల్లా ప్రతినిధి): భూ అక్రమార్కులు నక్ష స్థలాన్ని కూడా వదలడం లేదు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు గుటుక్కున మింగేస్తున్నారు. భూముల ధరలకు రెక్కలు రావడం తో ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు అక్కడ భూ బకాసురులు వాలిపోతూ ప్రభుత్వ స్థలాన్ని తమ కబంద హస్తాలలో బంధిస్తున్నారన్నా విమర్శలు.వినిపిస్తున్నాయి ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతుంది అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలను కాపాడాలి అంటూ ఒక పక్క ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్న కింద స్థాయిలో మాత్రం హెచ్చరికలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

## రెండు గ్రామాల సరిహద్దు రాయిని తొలగింపు





మేడ్చల్ మండలం నూతనకల్ - డబిల్పూర్ గ్రామాల సరిహద్దును సూచించే అధికారిక హద్దు రాయిని తొలగించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రామాల సరిహద్దు గుర్తులను తొలగించడం వల్ల స్థానిక రైతులు, భూ యజమానులు, గ్రామ ప్రజల హక్కులు దెబ్బతినే ప్రమాదముందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతనకల్ డబిల్ పూర్ గ్రామాల సరిహద్దును సూచించే అధికారిక హద్దురాయిని తొలగించి ప్రైవేటు సంస్థ ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదర్ కంపెనీ తన పరిశ్రమ చుట్టూ ప్రహరీ గోడను నిర్మిస్తూ ప్రభుత్వ రికార్డులో నమోదైన లక్ష దారిని తన ప్రాంగణంలో కలుపుకునే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



## విచారణ జరిపించాలి అంటూ తహసిల్దార్‌కు వినతి

ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలి అంటూ ఆ గ్రామానికి చెందిన గాయింత రాజకుమార్ అనే వ్యక్తి మేడ్చల్ తహసిల్దార్ కు అందజేసిన వినతి పత్రంలో కోరారు. నూతనకల్ - డబిల్పూర్ గ్రామాల సరిహద్దులను సూచించే సరిహద్దురాయిని తొలగించి ఆ స్థలాన్ని కబ్జా చేసుకోవడానికి ఓ ప్రైవేట్ సంస్థ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపితే అసలు విషయాలు బయటకు వస్తాయని మేడ్చల్ తహసిల్దార్ ను కోరారు.

# లా రీవాల్యుయేషన్‌పై ఓయూ స్పష్టత.. నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు: రిజిస్ట్రార్

**మూల్యాంకనంలో తప్పిదాలకు తావులేదు: ఉస్మానియా యూనివర్సిటీ..**



సికింద్రాబాద్, జూన్ 11 (మనం న్యూస్) ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల మూల్యాంకనం, పునర్మూల్యాంకనం (రీ వాల్యుయేషన్) ప్రక్రియపై ఇటీవల వెలువడిన వార్తల నేపథ్యంలో విశ్వవిద్యాలయ పరిపాలన స్పష్టత ఇచ్చింది. పరీక్షల మూల్యాంకన వ్యవస్థ అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా, డిజిటల్ భద్రతతో నిర్వహించబడుతోందని ఓయూ రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి తెలిపారు. లా పరీక్షల పునర్మూల్యాంకనంలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారనే వార్తలపై పరీక్షల విభాగం నుంచి వివరణ కోరినట్లు ఆయన వెల్లడించారు. మూల్యాంకనం, పునర్మూల్యాంకనం ప్రక్రియల్లో తప్పులు జరిగే అవకాశం లేదని పేర్కొన్నప్పటికీ, ఏదైనా నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే సంబంధిత మూల్యాంకనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అంశంపై ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన లా పరీక్షల ఫలితాల్లో మొత్తం 5,831 మంది విద్యార్థుల్లో 86 శాతం మంది తమ మార్కులపై సంతృప్తి వ్యక్తం చేశారని పరీక్షల విభాగం వెల్లడించింది. కేవలం 14 శాతం మంది మాత్రమే రీ వాల్యుయేషన్కు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొంది. పునర్మూల్యాంకనానికి దరఖాస్తు చేసిన వారిలో సుమారు 300 మంది విద్యార్థుల మార్కులు లేదా గ్రేడ్లలో స్వల్ప మార్పులు నమోదయ్యాయని, ఇది మొత్తం విద్యార్థుల్లో కేవలం 5.14 శాతం మాత్రమేనని పరీక్షల నియంత్రణాధికారి వివరించారు. ఈ మార్పులు ఒకే కోర్సుకు పరిమితం కాకుండా వివిధ కోర్సుల్లో స్వల్ప స్థాయిలో మాత్రమే చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. వివరణాత్మక ప్రశ్నాపత్రాల మూల్యాంకనంలో స్వల్ప మార్కుల వ్యత్యాసాలు సహజమని, వాటిని వ్యవస్థాగత లోపాలుగా పరిగణించరాదని పేర్కొన్నారు. పునర్మూల్యాంకన మార్కులు, మొదటి మూల్యాంకన మార్కుల మధ్య 10 శాతానికి మించి వ్యత్యాసం ఉన్నప్పుడే సవరించిన మార్కులను పరిగణనలోకి తీసుకునే నిబంధన అమలులో ఉందని గుర్తు చేశారు.

**పారదర్శకతకు పెద్దపీట**

విశ్వవిద్యాలయం ఆన్లైన్ మూల్యాంకన విధానాన్ని అమలు చేస్తోందని, ఇందులో విద్యార్థుల పేరు, హాల్టికెట్ నంబర్ వంటి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అధికారులు తెలిపారు. పునర్మూల్యాంకనాన్ని బోర్డ్ ఆఫ్ స్టడీస్ నామినేట్ చేసిన స్వతంత్ర సబ్జెక్టు నిపుణుల ద్వారానే నిర్వహిస్తామని వెల్లడించారు. మూల్యాంకనంలో నిర్లక్ష్యం లేదా విద్యా ప్రమాణాల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత ఎగ్జామినర్ లను శాశ్వతంగా తొలగించడంతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని విశ్వవిద్యాలయ పరిపాలన హెచ్చరించింది. విద్యార్థులకు న్యాయబద్ధమైన, ఖచ్చితమైన, సురక్షితమైన గ్రేడింగ్ వ్యవస్థను అందించేందుకు ఓయూ కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేశారు.

---

# లంబాడీ అధికారులపై కక్షపూరిత చర్యలు ఆందోళనకరం: డా. కరాటే రాజు నాయక్

**లంబాడీ అధికారులపై వరుస దాడులు గిరిజన సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి..**

**అత్యధిక జనాభా ఉన్న లంబాడీలకు ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం లేదు..**

**లంబాడీల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతాం..**



సికింద్రాబాద్, జూన్ 11 (మనం న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లంబాడీ సమాజానికి చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులపై వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తున్నారనే భావన గిరిజన సమాజంలో బలపడుతోందని తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక, ఓయూ జేఏసీ చైర్మన్ డా. కరాటే రాజు నాయక్ ఆరోపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆరట్స్ కళాశాల వద్ద వివిధ గిరిజన, లంబాడీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడీ అధికారులపై వరుసగా ఏసీబీ దాడులు జరగడం గిరిజన సమాజంలో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే ఒకే వర్గానికి చెందిన అధికారులపై వరుస చర్యలు జరుగుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో లంబాడీ సమాజం కీలక పాత్ర పోషించిందని, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు తమ వంతు త్యాగాలతో రాష్ట్ర ఆవిర్భావానికి తోడ్పడ్డారని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో పరిపాలన, విద్య, వైద్యం, ఇంజనీరింగ్, పోలీస్, రెవెన్యూ తదితర రంగాల్లో లంబాడీ అధికారులు విశేష సేవలు అందించారని చెప్పారు. అలాంటి సమాజానికి గౌరవం, గుర్తింపు, ప్రాధాన్యం దక్కాల్సి ఉండగా అవమానం, అనుమానం, వివక్ష ఎదురవుతున్నాయనే భావన నెలకొనడం బాధాకరమన్నారు. తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములైన లంబాడీలను అనుమానితులుగా చిత్రీకరించే పరిస్థితులు రావడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో లంబాడీ సమాజం కీలక పాత్ర పోషించినప్పటికీ, అత్యధిక జనాభా కలిగిన ఈ వర్గానికి మంత్రి పదవి ఇవ్వకపోవడం, గిరిజన సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం, సమస్యలను నిర్లక్ష్యం చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. లగచర్ల ప్రాంతంలో లంబాడీ రైతుల భూముల సమస్యలతో ప్రారంభమైన వివాదాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, పలువురు ఉన్నతాధికారులు వరుస విచారణలు, దాడులను ఎదుర్కొంటున్నారని అన్నారు. లంబాడీ సమాజానికి తగిన బడ్జెట్ కేటాయింపులు, కార్పొరేషన్లలో ఖాళీల భర్తీ, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు ఇచ్చిన హామీల అమలు, ఎస్సీ-ఎస్టీ సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజాప్రతినిధులు, లంబాడీ నాయకులు కూడా తమ మౌనం వీడి సమాజ సమస్యలపై స్పందించాలని కోరారు. లంబాడీలు తెలంగాణ అభివృద్ధికి తమ శ్రమ, ప్రతిభతో తోడ్పడ్డారని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో బలంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన చైతన్య వేదిక, ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ, తెలంగాణ గిరిజన శక్తి తదితర సంఘాల నాయకులు నెహ్రూ నాయక్, రవీందర్ నాయక్, సుబ్బు నాయక్, సురేష్ నాయక్, ధారావత్ సురేష్ నాయక్, నరేష్ నాయక్, భాస్కర్ నాయక్, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# చౌకీదార్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల , జూన్ 11(మనం న్యూస్): చేవెళ్ళ మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో చౌకీదార్ (వాచ్మెన్) పోస్టు భర్తీకి అర్హులైన మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహ బాలికల భద్రత దృష్ట్యా అనుభవం, సేవాభావం ఉన్న మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఆసక్తి గల అభ్యర్థులు తమ అర్హత, అనుభవ పత్రాలతో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వసతి గృహ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆమె సూచించారు.



# ఆకాశాన్ని అంటుతున్న అక్రమ కట్టడాలు

**స్థానిక నేతల అండదండలతో**

**రెచ్చిపోతున్న అక్రమ నిర్మాణదారులు**

**అనుమతులు ఒకరకంగా నిర్మాణాలు మరోరకంగా**

**పట్టించుకునే నాథుడే లేరు**







మేడ్చల్, జూన్ 11 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిల గుండ్ల పోచంపల్లి లో పరిధిలోని మైసమ్మగూడలో అక్రమ కట్టడాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అనుమతులు ఒక రకంగా పొంది నిర్మాణాలు మరోరకంగా చేపట్టినారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అండతో చేపడుతున్న అక్రమ భవన నిర్మాణాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలను అధికారులు కండ్లు అప్పగించి చూస్తున్నారే చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదేమిటి అని అక్రమ నిర్మాణ దారులను ప్రశ్నిస్తే మాజీ కౌన్సిలర్ మా బంధువు అని, తాను నిరుద్యోగినని, ఏవో ఏవో మాయ మాటలు చెబుతూ అక్రమ భవన నిర్మాణాలను చేపడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వం ఆదాయానికి గండిపడుతున్నా అధికారులు చర్యలు మాత్రం తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. జి ప్లస్ టు అనుమతులు తీసుకొని అదనంగా మరో మూడు అంతస్తులను నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ ఆదానికి గండి కొడుతున్నారు.

**మేము లోకల్.. మమ్మల్ని ఎవరు ప్రశ్నించేది**

మేము లోకల్.. మమ్మల్ని ఎవరు ప్రశ్నిస్తారు అంటూ అక్రమ నిర్మాణదారులు ఇష్టానుసారంగా భవనాలను నిర్మిస్తూ హాస్టల్స్ కు అద్దెకిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. మైసమ్మగూడలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలో చదివేందుకు వివిధ ప్రదేశాల నుండి విద్యార్థిని విద్యార్థులు వస్తారు. వారు ఇక్కడ ఉంటూ విద్యను అభ్యసిస్తారు. వీరి కోసం ఇక్కడ పుట్టగొడుగుల్లా హాస్టల్ నిర్మాణాలు సాగాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా దాదాపు ఏ ఒక్కరు నిబంధనలను పాటించకుండా భవన నిర్మాణాలను నిర్మించి హాస్టల్స్ కు అద్దెకిస్తున్నారు. ఇదేమిటి అని ప్రశ్నిస్తే మేము లోకల్ అంటూ సమాధానం వస్తుంది. ఇక్కడ సంబంధిత అధికారులు సైతం కండ్లు అప్పగించి చూడడమే తప్ప వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అక్రమ కట్టడాలకు కనీసం నోటీసులు కూడా ఇచ్చే పరిస్థితిలో అధికారులు లేరు.

**ఇక్కడ మరీ దారుణం**

గుండ్ల పోచంపల్లి డివిజన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రాంతంలో మరీ దారుణం. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఇదేమిటని వీరిని ప్రశ్నించేవారు లేరు... ఎవరు ఇష్టం ఉన్నట్టు వారు అక్రమ నిర్మాణాలు చేపట్టుకుంటూ పోతున్నారు. మైసమ్మగూడలో జి ప్లస్ టు వరకు అనుమతులు అయినా పొందుతున్నారు. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టుకుంటూ పోతున్నారు. వీరిని అదుపు చేసేవారు లేక రోజుకో అక్రమ నిర్మాణం వెలుస్తుంది. కూత వేటు దూరంలో డివిజన్ కార్యాలయం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాల వైపు చూసిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు అక్రమ నిర్మాణాలను కట్టడి చేయకపోతే భవిష్యత్తులో మరిన్ని అక్రమ కట్టడాలు వెలిసే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# శానిటరీ సిబ్బందికి కమిషనర్ హెచ్చరిక

**ఎఫ్ఆర్ఎస్ లేని వారికి వేతనాలు నిలిపివేయాలి**



సికింద్రాబాద్, జూన్ 11 (మనం న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటిని ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడంతో పాటు పారిశుధ్య సిబ్బంది పనితీరుపై కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. గురువారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో ఉప్పల్, బోడుప్పల్ ప్రాంతాల శానిటరీ ఫీల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పరిశుభ్రతను మెరుగుపర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. స్వచ్ఛ ఆటోల ద్వారా ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఒక్క ఇల్లు కూడా మిగలకుండా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య వ్యవస్థలో అవసరానికి మించి పర్యవేక్షణ సిబ్బంది ఉండటం వల్ల పనితీరుపై ప్రభావం పడుతోందని కమిషనర్ వ్యాఖ్యానించారు. శానిటరీ వర్కర్లను ఇతర విధులకు పంపకుండా కేవలం పారిశుధ్య పనులకే వినియోగించాలని స్పష్టం చేశారు. శాశ్వత ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు తప్పనిసరిగా చేయాలని హెచ్చరించారు. ఉప్పల్ సర్కిల్లో 516 మంది కార్మికుల్లో 40 మందికి, బోడుప్పల్ సర్కిల్లో 458 మందిలో 13 మందికి, ఘట్కేసర్ సర్కిల్లో 594 మందిలో 110 మందికి ఎఫ్ఆర్ఎస్ నమోదు లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, ఇకపై ఎఫ్ఆర్ఎస్ హాజరు లేని కార్మికులకు వేతనాలు చెల్లించవద్దని అధికారులను ఆదేశించారు. అలాగే ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచని శానిటరీ ఫీల్ అసిస్టెంట్లను సాధారణ కార్మికులుగా నియమించి, మెరుగైన పనితీరు ప్రదర్శించే కార్మికులకు ఎస్ఎఫ్ఏ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. పారిశుధ్య వ్యవస్థలో జవాబుదారీతనం పెంపొందించి నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, పారిశుధ్య అదనపు కమిషనర్ రఘుప్రసాద్, ఎస్డబ్ల్యూఎం ఎస్ఈ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్లు శైలజ, వాణి తదితర అధికారులు, శానిటరీ ఫీల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.





# లబ్ధిదారుడికి రూ.3 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, జూన్ 11 (మనం న్యూస్) వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అండగా నిలిచారు. గురువారం తన నివాస కార్యాలయంలో రసూల్పురా ఇందిరమ్మనగర్కు చెందిన రాజుకు రూ.3 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ను అందజేశారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.3 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ఓసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదని, పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో వైద్య సహాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# అశ్రు నాయనాల మధ్య డాక్టర్ కంభం వెంకట్ రాజ్ అంత్యక్రియలు

**నివాళులు అర్పించిన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్,ఎంపీ ఈటల రాజేందర్,కాసాని జ్ఞానేశ్వర్**





మేడ్చల్, జూన్ 11( మనం జిల్లా ప్రతినిధి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంభం వెంకట్ రాజ్ ఉదయం తెల్లవారుజామున నగరంలోని తన నివాసంలో గుండెపోటుతో మరణించారు.అనంతరం కుటుంబ సభ్యులు మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రానికి భౌతికకాయని తరలించారు.విషయం తెలుసుకున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఎంపీ ఈటల రాజేందర్,ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్సీ కాసానికి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విచ్చేసి భౌతిక కాయానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పూడూరు గ్రామంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు.డాక్టర్ కంభం వెంకట్ రాజ్ మృతి పూడూరు గ్రామస్తులతోపాటు మేడ్చల్ మండల ప్రజలు,కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. పూడూరు గ్రామంలో ఎన్నో అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేసుకున్నారు.పూడూరు-కిష్టాపూర్ పేరుతో డివిజన్ ఏర్పాటుకు సైతం విశేషంగా కృషి చేశారని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు చిన్నంగి వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేణు గోపాల్ రెడ్డి,శామీర్ పేట,పూడూరు సొసైటీ మాజీ చైర్మన్ లు పెంట రెడ్డి,సత్యనారాయణ రెడ్డి,రవీందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ లు పీసరి శ్రీనివాస్ రెడ్డి,బాబు యాదవ్,దేవేందర్ రెడ్డి,సింగరేణి సుగుణమ్మ,దుడ్డు సంజీవరావు,బండారి నరేందర్,మాజీ ఎంపీటీసీ సింగరేణి పోచయ్య,నీరుడి రఘు,బాల మల్లేష్,ఎల్లంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కౌన్సిలర్ ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి,ఎండీ ఆరిఫ్,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి,సద్ది సుదర్శన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్,మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్,శేఖర్ రెడ్డి,హన్మంత్ రెడ్డి,శేషి కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భార్యపై అనుమానమే ప్రాణం తీసింది

**24 గంటల్లోనే హంతకుడిని పట్టుకున్న పోలీసులు..
దేశీయ తుపాకీ, బుల్లెట్లు, కత్తులు స్వాధీనం..
వివాహేతర అనుమానాలే హత్యకు కారణమని పోలీసుల వెల్లడి..**




సికింద్రాబాద్, జూన్ 11 (మనం న్యూస్) మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల సంచలనం సృష్టించిన గృహిణి హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఉపయోగించిన దేశీయ తుపాకీ, సజీవ బుల్లెట్లు, కత్తులు సహా పలు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్లోని మల్కాజ్గిరి డిసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి జోన్ డిసిపి సిహెచ్ శ్రీధర్ మీడియాకు వివరాలు వెల్లడించారు.. మారుతీనగర్కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ధమరా అరుణ్ కుమార్ (48) తన భార్య ధమరా నిశారాణి (35) పై గత కొంతకాలంగా అనుమానాలు పెంచుకుని తరచూ వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ కారణంగా నిశారాణి పలుమార్లు మెదక్ జిల్లా నర్సాపూర్లోని బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అరుణ్ కుమార్ గతంలో అంబర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఆయుధాల కేసులో కూడా నిందితుడిగా ఉండి జైలుశిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. జైలు నుంచి విడుదలైన అనంతరం భార్యను తిరిగి ఇంటికి తీసుకువచ్చినప్పటికీ, దాంపత్య కలహాలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ నేపథ్యంలో జూన్ 10వ తేదీ తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో మారుతీనగర్లోని తన నివాసంలో అరుణ్ కుమార్ తుపాకీతో నిశారాణిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసిన మల్కాజిగిరి పోలీసులు సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేపట్టి గురువారం మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన నిందితుడు అరుణ్ కుమార్ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు మీర్ ముజమ్మిల్ అలీ ఖాన్ను కూడా గుర్తించగా, హరిందర్ సింగ్ అలియాస్ హర్భజన్ సింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఒక దేశీయ తుపాకీ, మూడు సజీవ బుల్లెట్లు ఉన్న మ్యాగజైన్, మూడు కత్తులు, ఒక సర్జికల్ బ్లేడ్, ఒక మారుతి బలెనో కారు, ఒక బజాజ్ చేతక్ స్కూటర్తో పాటు ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ చి. శ్రీను, సిబ్బంది ఈ కేసును ఛేదించారు. కేసును వేగంగా పరిష్కరించిన పోలీసు బృందాన్ని కమిషనర్ అభినందించారు.





# మెట్టుగూడలో బోర్ వెల్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి

**కేఎస్ శిల్పాచారి**

సికింద్రాబాద్, జూన్ 11: (మనం న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మెట్టుగూడ డివిజన్లో నెలకొన్న పవర్ బోర్వెల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కేఎస్. శిల్పాచారి డిమాండ్ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ ఆదేశాల మేరకు ఇటీవల మెట్టుగూడ డివిజన్లోని దూద్బావి ప్రాంతాన్ని సందర్శించి స్థానికుల నుంచి బోర్వెల్స్ సమస్యలపై వివరాలు సేకరించిన ఆమె, గురువారం సంబంధిత విభాగం డీజీఎం రాజుతో సమావేశమై సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా మెట్టుగూడ డివిజన్లో ఉన్న అన్ని పవర్ బోర్వెల్స్ పరిస్థితి, అవి ఏ శాఖ పరిధిలో పనిచేస్తున్నాయనే వివరాలను తెలుసుకోవడంతో పాటు, దూద్బావి బస్తీకి సంబంధించిన రెండు పవర్ బోర్వెల్స్ మరమ్మతులపై ప్రత్యేకంగా చర్చించారు. పలు ప్రాంతాల్లో బోర్వెల్స్ పై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శిల్పా చారి డీజీఎం దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ లోని ప్రతి బోర్వెల్ కు బాధ్యులను నియమించి, వాటి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని, నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా దూద్బావి ప్రాంతంలోని రెండు పవర్ బోర్వెల్స్ ను తక్షణమే మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు త్వరలోనే చేపడతామని డీజీఎం రాజు హామీ ఇచ్చినట్లు కేఎస్ శిల్పాచారి తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.